విద్యుత్ నిలిచిపోవడంతో ధ్రువపత్రాలతో బయట పడిగాపులు కాస్తున్న వాహనదారులు

ఆర్టీవో సేవలకు అంతరాయం

గంటసేపు కరెంటు కోతలతో నిలిచిపోయిన సేవలు

కార్యాలయం ఎదుట వాహనదారుల పడిగాపులు

రఘునాథపాలెం, జూలై 8 : విద్యుత్ కోతలతో ఖమ్మం నగరంలోని ఆర్టీవో కార్యాలయంలో సేవలు నిలిచిపోయాయి. దీంతో గత కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదని, కాంగ్రెసోళ్ల పాలన అంటే.. గిట్లనే ఉంటది అని కార్యాలయానికి పలు పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు, వాహనదారులు గొణుక్కోవడం వినిపించింది. ఖమ్మం జిల్లా ప్రాతీయ రవాణా శాఖ కార్యాలయంలో సోమవారం సుమారు గంటసేపు విద్యుత్ నిలిచిపోయింది. దీంతో లైసెన్సు, రిజిస్ట్రేషన్ వంటి పలు రకాల సేవల నిమిత్తం వచ్చిన వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. తమ పనులకు సంబంధించిన ఫైళ్లను పట్టుకొని కార్యాలయంలోని క్యూలైన్లలో వేచి చూశారు. ఉక్కపోతకు తట్టుకోలేక కార్యాలయం ఎదుట కూర్చొని కరెంటు ఎప్పుడొస్తదా.. అని పడిగాపులు కాశారు. కరెంటు పోవడంతో కార్యాలయంలోని అధికారులు కూడా తమ సీట్లకే పరిమితమయ్యారు. గంట తర్వాత కరెంటు రావడంతో వాహనదారులు, కార్యాలయ ఉద్యోగులు ఊపిరిపీల్చుకున్నారు.

ఖమ్మం జిల్లావాసి బ్రెయిన్ డెడ్

అవగాహనతో మరికొందరికి అవయవ దానం

రంగారావు (ఫైల్)

మన్సూరాబాద్, జూలై 8 : పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా మరి కొందరికి ప్రాణం పోసేందుకు ఓ కుటుంబం ముందుకు వచ్చింది. బ్రెయిన్ డెడ్ అయిన తమ కుటుంబ సభ్యుడి అవయవాలను దానం చేసి మరికొందరికి ప్రాణం పోశారు. నేలకొండపల్లి మండలం మండ్రాజుపల్లికి చెందిన మందపల్లి రంగారావు(53) వృత్తి రీత్యా రైతు. గత నెల 28న ఇంట్లో అకస్మాత్తుగా కిందపడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానకు తరలించారు. ఐసీయూలో ఉంచి తొమ్మిది రోజులపాటు చికిత్స అందించినప్పటికీ అతడి ఆరోగ్యం కుదుటపడలేదు. రంగారావుకు ఈ నెల 7న మధ్యాహ్నం బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు గుర్తించారు. విషయాన్ని తెలుసుకున్న జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు రంగారావు భార్య రేణుకతోపాటు కుటుంబ సభ్యులను కలుసుకుని అవయవదానంపై అవగాహన కల్పించారు. మరణించిన తమ కుటుంబ సభ్యుడి వల్ల మరికొందరి జీవితాల్లో వెలుగులు నిండుతాయని తెలుసుకున్న వారు బ్రెయిన్ డెడ్ అయిన రంగారావు అవయవాలను దానం చేసేందుకు ముందుకొచ్చారు. రంగారావుకు చెందిన రెండు కిడ్నీలు, లివర్, రెండు కార్నియాలను దానం చేశారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి: ఎమ్మెల్యే

సత్తుపల్లిటౌన్, జూలై 8: ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి పేర్కొన్నారు. సోమవారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి వైశ్యకాంతుల చెరువు కట్టపై సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ రవిబాబు, సిబ్బంది ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ తోట సుజలరాణి, కౌన్సిలర్ పద్మజ్యోతి, శివవేణు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ నిర్బంధ కాండ!

- విప్లవ సంఘాల పేరిట కాంగ్రెస్ ఉక్కుపాదం మోపే ప్రయత్నం
- సామాన్య జీవితం గడుపుతున్న నేతలకు సంకెళ్లు
- నిఘాకు ప్రత్యేక బృందాలు!
- తాజాగా, మాజీ మావోయిస్టు రమాకాంత్ అరెస్ట్‌తో కలకలం
- సింగరేణి వ్యాప్తంగా ఆందోళన
- మాజీ నేతల్లో మళ్లీ అలజడి


రియాజ్ అలియాస్ సుధాకర్, రమాకాంత్

కరీంనగర్, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) / జమ్మికుంట, జూలై 8: ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ మళ్లీ నిర్బంధకాండ మొదలు పెట్టింది. విప్లవ సంఘాల పేరిట అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ, ఇప్పుడు వారిని తొక్కే ప్రయత్నం చేస్తున్నది. జనజీవన స్రవంతిలో కలిసి, సామాన్య జీవితం గడుపుతున్న నాయకులపైనా ఉక్కుపాదం మోపుతున్నది. అందుకోసం ప్రత్యేక పోలీస్ బృందాలను రంగంలోకి దించి, అరెస్టులు చేయిస్తున్నది. సికాస పేరిట అరెస్టులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నది. అందుకు మావోయిస్టు నేత మహ్మద్ హుస్సేన్ (అలియాస్ సుధాకర్, అలియాస్ రమాకాంత్) అరెస్ట్ చేయడమే నిదర్శనం. వివరాల ప్రకారం.. 1978 నుంచి 1981 వరకు కేకే-2 గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేసిన మహ్మద్ హుస్సేన్ మావోయిస్టు పార్టీకి ఆకర్షితుడై చేరాడు. ఉత్తర తెలంగాణ కమిటీ మెంబర్‌గా ఎదిగాడు. మావోయిస్టు అనుబంధ సంఘమైన సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) వ్యవస్థాపక సభ్యుడిగా, సీవోగా పనిచేశాడు. అప్పుడు ఆయనపై వివిధ పోలీస్‌స్టేషన్లలో 28 క్రిమినల్ కేసులు నమోదు కాగా, దాదాపు 12 ఏండ్లు జైలు జీవితం గడిపాడు. చివరగా 2009లో ఝార్ఖండ్‌లో బొకారో జిల్లాలో అరెస్టయి, 2013 వరకు జైలు జీవితం గడిపి బయటకు వచ్చాడు. అనారోగ్య కారణాలతో బెయిల్‌పై విడుదలైన ఆయన, దాదాపు పదకొండేళ్లుగా జమ్మికుంటలో సాధారణ జీవితం గడుపుతున్నాడు. 70 ఏండ్లకు పైబడిన ఆయన, ఇప్పుడు అనారోగ్యంతో సతమతమవుతున్నాడు. అలాంటి రమాకాంత్‌ను అరెస్ట్ చేయడం విమర్శలకు తావిస్తున్నది.

అరెస్ట్‌తో కలకలం

రమాకాంత్ రెండు నెలలుగా మావోయిస్టు భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి సింగరేణి కోల్‌బెల్ట్ ఏరియాలో సికాస పునర్నిర్మాణం కోసం కృషి చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. మందమర్రి, రామకృష్ణాపూర్ ప్రాంతాల్లో మావోయిస్టు పార్టీ సానుభూతి పరులకు సోమవారం కరపత్రాలు పంచుతున్నాడని సమాచారం అందిందని చెబుతున్నారు. ఈ మేరకు ప్రత్యేక బృందాలతో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్‌ఐ రాజశేఖర్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఆర్‌కే 1 గని రోడ్‌లో బ్యాగ్‌తో రమాకాంత్ కనిపించాడు. పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. తనిఖీ చేయగా బ్యాగులో మావోయిస్టుల పేరుతో పోస్టర్లు లభించాయి. వెంటనే అదుపులోకి తీసుకొని ఏసీపీ విచారించారు. జమ్మికుంటకు చెందిన మహ్మద్ హుస్సేన్‌గా గుర్తించారు. ఈ అరెస్ట్‌పై బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఉదయం జమ్మికుంటలోని తన ఇంట్లో ఉన్న హుస్సేన్‌ను బలవంతంగా పట్టుకెళ్లారని ఆరోపిస్తున్నారు. ఆయనకు కంటి ఆపరేషన్ చేయించాల్సి ఉందని చెబుతున్నారు.

మళ్లీ అలజడి

ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన పోరాటానికి సికాస కూడా మద్దతు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతోపాటు అనేక సమస్యలపై సింగరేణి గడ్డ మీద పోరాటాలు చేసింది. అయితే, రాష్ట్ర ఏర్పాటు అనంతరం బీఆర్‌ఎస్ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి అన్ని విప్లవ సంఘాలు దాదాపు తమ కార్యకలాపాలు తగ్గించాయి. అదే కోణంలో ప్రభుత్వం సైతం అన్ని రకాల సహకారం అందించడంతో చాలామంది విప్లవ సంఘాల నాయకులు ప్రభుత్వం ముందు లొంగిపోయారు. లొంగిపోయిన నాయకులకు సైతం ప్రభుత్వం చేయూతనివ్వడంతో సాధారణ జీవితం గడుపుతున్నారు. తాజా అరెస్టుతో లొంగిపోయిన మావోయిస్టులు, సానుభూతి పరులు, విప్లవ సంఘాల నాయకుల్లో అలజడి మొదలైంది. సికాస పునర్నిర్మాణానికి రమాకాంత్ ప్రయత్నం చేస్తున్నాడనే కారణంపై అతన్ని అరెస్ట్ చేసినట్టు పోలీసులు చెబుతున్నది నిజమైతే ఆయన వయసు రీత్యా ముందుగా అతన్ని పిలిచి హెచ్చరించాల్సింది. కానీ, ఇవేమీ లేకుండా నేరుగా అరెస్ట్ చేయడం విమర్శలకు తావిస్తున్నది. అయితే, సికాస కార్యకలాపాలపై నిఘా పెట్టడంతోపాటు అరెస్టల కోసం ఏకంగా ఒక ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తున్నది. అయితే, పునర్నిర్మాణం మాట ఎలా ఉన్నా ప్రస్తుత అరెస్ట్ మాత్రం కలకలం రేపుతున్నది. ఈ అరెస్ట్ ఇక్కడితోనే ఆగుతుందా..? లేక మాజీల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇదే కోణంలో ముందుకెళ్తుందా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

హుస్సేన్‌ను వెంటనే విడుదల చేయాలి

మాజీ మావోయిస్టు, రచయిత హుస్సేన్‌ను పోలీసులు జమ్మికుంటలోని ఆయన ఇంటి నుంచి అక్రమంగా పట్టుకెళ్లడాన్ని ఖండిస్తున్నామని, వెంటనే ఆయనను విడుదల చేయాలని తెలంగాణ మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు ఎస్ జీవన్‌కుమార్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎస్ తిరుపతయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని పాత మార్కెట్ వద్ద తన సొంత ఇంటిలో ఉన్న హుస్సేన్‌ను పోలీసులు దౌర్జన్యంగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. దౌర్జన్యాన్ని ఆపి మహ్మద్ హుస్సేన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రైతు ఆత్మహత్యాయత్నం

- తన భూమిని దున్ననివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన
- న్యాయం చేయాలంటూ బాధిత రైతు వేడుకోలు
- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు సీతయ్యపై కేసు నమోదు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు సీతయ్య

ముదిగొండ, జూలై 8 : తన భూమిలో సాగు చేయకుండా పలువురు అడ్డుపడుతున్నారని మనోవేదన చెందిన ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణాపురంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాణాపురం గ్రామానికి చెందిన రైతు మేడి సీతయ్య.. పక్క గ్రామం కమలాపురం రెవెన్యూలో సుమారు 5.20 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. దీనికి పట్టాదారు పాస్‌పుస్తకం కూడా ఉంది. ఈ భూమి చెరువుకు ఆనుకొని ఉండడంతో శిఖం భూమిని ఆక్రమించాడని కమలాపురంలోని పలువురు ఆరోపించగా.. పలుమార్లు చర్చలు జరిపారు. దీనిపై రెవెన్యూ అధికారులతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే రైతు సీతయ్య సోమవారం పొలం వద్దకు వెళ్లగా.. ఎప్పటి లాగానే కమలాపురానికి చెందిన కొందరు పనిచేయకుండా అడ్డుకోవడంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

దీంతో మనస్తాపం చెందిన సీతయ్య అక్కడే గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు సీతయ్యను ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం సీతయ్య ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది. కాగా.. అన్ని పత్రాలున్నా తన భూమిలో సాగు చేసుకోనీయకుండా కొందరు అడ్డుకుంటున్నారని, ఇక నాకు చావే శరణ్యమని భావించి ఆత్మహత్యకు పాల్పడ్డానని, ఇప్పటికైనా తనకు న్యాయం చేయాలని సీతయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సీతయ్యపై కేసు

కాగా.. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు మేడి సీతయ్యపై ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. కమలాపురం రెవెన్యూ పరిధిలోని చెరువు శిఖంలో మేడి సీతయ్య, ఆయన కుటుంబ సభ్యులు సుమారు 40 రోజుల క్రితం చెరువులోకి వర్షపు నీరు వెళ్లకుండా పెద్ద కట్ట పోశారు. దీనిపై కమలాపురం మత్స్య సహకార సంఘ సభ్యులు ముదిగొండ ఇరిగేషన్ డీఈ రాంబాబుకు ఫిర్యాదు చేయగా.. ఆయన చెరువును పరిశీలించారు. సీతయ్య అక్రమంగా కట్ట పోసినట్లు గుర్తించి కట్టను తొలగించారు. అయితే సీతయ్య, కుటుంబ సభ్యులు మళ్లీ కట్ట పోశారు. సమాచారం తెలుసుకున్న ఇరిగేషన్ ఏఈ భగీరథ బాబు చెరువు వద్దకు వెళ్లగా.. సీతయ్య కట్టను తొలగిస్తే మందు తాగుతానని ఏఈని బెదిరించాడు. సోమవారం మళ్లీ కట్ట ఎత్తు పెంచుతుండగా మత్స్య సహకార సభ్యులు వెళ్లగా.. వారిని బెదిరించడం కోసం మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇరిగేషన్ డీఈ రాంబాబు ఫిర్యాదు మేరకు సీతయ్యతోపాటు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

ఏయే ఖాతాలకు ఎంత బదిలీ?

ఆయా బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తున్న అధికారులు

లోతైన పరిశోధన కోసం మరికొన్ని స్కూళ్ల ఖాతాల తనిఖీ

షోకాజ్ నోటీసులకు వివరణ ఇచ్చిన ముగ్గురు సిబ్బంది

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 8: ఖమ్మం జిల్లా విద్యాశాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి తన చేతివాటం ప్రదర్శించి స్వాహా చేసిన సొమ్మును ఏయే అకౌంట్లకు ఎంత మొత్తం బదిలీ చేశాడనే కోణంలో విద్యాశాఖాధికారులు విచారణ చేస్తున్నారు. సదరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి.. పలు పాఠశాలలకు చెందిన స్కూల్ గ్రాంట్‌ను తన వ్యక్తిగత ఖాతాలో జమ చేసుకున్నాడు. సుమారు 20 పాఠశాలలకు చెందిన సుమారు రూ.1.80 కోట్ల నగదు అనేది విద్యాశాఖాధికారుల అంచనా. అయితే ఇంకా ఎంత స్థాయిలో గ్రాంట్లు స్వాహా చేశాడనే కోణంలో మిగిలిన స్కూళ్లకు చెందిన అకౌంట్లను పరిశీలిస్తున్నారు. దీంతోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాఠశాల విద్యాశాఖకు సంబంధించిన ఖాతాలను సైతం ఈ ఉద్యోగే పర్యవేక్షించడంతో అక్కడి అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా సోమవారం ఖమ్మం డీఈవో సోమశేఖరశర్మతో మరో ఇద్దరు విద్యాశాఖ సిబ్బంది ఆయా బ్యాంకు ఖాతాలను పరిశీలించారు. బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా తన అకౌంట్ నుంచి అధిక మొత్తంలో నగదు డ్రా చేయడంతోపాటు అత్యధిక మొత్తంలో నగదును మరో అకౌంట్‌కి బదిలీ చేసినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు తెలుస్తోంది. మంగళవారం నుంచి త్రీటౌన్ పోలీసులు విచారణ చేయనున్నారు.

షోకాజ్‌లకు వివరణ..

స్కూల్ గ్రాంట్ల స్వాహాలో భాగంగా విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ముగ్గురికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. సంబంధిత ఉద్యోగులు షోకాజ్‌లకు వివరణ రాసి డీఈవోకి అందజేశారు. షోకాజ్‌లకు అందిన వివరణ, సోమవారం జరిగిన పురోగతి వివరాలను ఉన్నతాధికారులకు డీఈవో తెలియజేశారు. ఒకటి రెండు రోజుల్లో డైరక్టరేట్ నుంచి విచారణాధికారిని నియమించే అవకాశం ఉంది. ఇంత కీలకమైన విభాగాన్ని ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి అప్పగించడం పట్ల పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెగ్యులర్ డీఈవో లేకపోవడం, పర్యవేక్షణ కొరవడడం వంటి కారణాల వల్లనే ఇలాంటి తప్పిదాలకు అవకాశం కలుగుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

వాణిజ్య

భెల్, ఓడీఎఫ్‌లకు గ్రహణం

- కేంద్రం నుంచి ఆర్డర్లు కరువు
- ఇలాగే కొనసాగితే ఖాయిలానే అంటున్న కార్మిక సంఘాలు
- కేసీఆర్ చేయూతతో ఊరట
- కంపెనీల్లో కొత్త రిక్రూట్‌మెంట్ బంద్‌పెట్టిన బీజేపీ ప్రభుత్వం

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని కార్పొరేషన్‌గా మార్చిన మోదీ సర్కారు

ఆత్మనిర్భర్ భారత్ అంటూ గొప్పలకు పోయే మోదీ సర్కారు.. కీలక ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నది.

సంగారెడ్డి జిల్లాలో మూడు ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థలున్నాయి. రక్షణ రంగానికి సంబంధించి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, బీడీఎల్ పరిశ్రమలుండగా.. వీటితోపాటు బీహెచ్ఈఎల్ ఉన్నదీ ఇక్కడే.

ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు వీటిని స్థాపించారు. అయితే నరేంద్ర మోదీ ఆ పదవిలోకి వచ్చాక ఇవి నిర్వీర్యమైపోతున్నాయి. నష్టాలబాటపట్టి ఉద్యోగులు, కార్మికుల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అయినప్పటికీ గత పదేండ్లలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రభుత్వం తరపున ఆర్డర్లిస్తూ ఆదుకున్నారు.

ఓడీఎఫ్‌లో తయారైన యుద్ధ ట్యాంకును సంగారెడ్డి జిల్లా కంది మండలం మల్కాపూర్ చెరువులో పరీక్షిస్తున్న ఇంజినీర్లు (ఫైల్) (ఇన్‌సెట్)సంగారెడ్డి జిల్లాలోని బీహెచ్ఈఎల్

సంగారెడ్డి, జూలై 8 (నమస్తే తెలంగాణ): నరేంద్ర మోదీ దేశ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలకు గ్రహణం పట్టుకున్నది. ప్రైవేటీకరణ పేరుతో సర్కారీ కంపెనీలు కుదేలయ్యాయి. తెలంగాణ విషయానికే వస్తే.. సంగారెడ్డి జిల్లాలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ (ఓడీఎఫ్), భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) పరిశ్రమలు అధోగతి పాలయ్యాయి. కేంద్ర ప్రభుత్వ చిన్న చూపుతో కొత్త ఆర్డర్లు లేక నష్టాల్లోకి జారుకున్నాయి. ఉద్యోగాలు లభించక యువత ఇబ్బందులు పడుతున్నది.

కార్పొరేషన్ పరిధిలోకి ఓడీఎఫ్

సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ గ్రామ పరిధిలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉన్నది. గతంలో భారత ప్రభుత్వ రంగ సంస్థగా ఉండేది ఇది. క్షిపణులు, యుద్ధ ట్యాంకులు, మైన్ ప్రూఫ్-బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు తయారయ్యేవి. మిలటరీ అవసరాలకు కేంద్రం ఓడీఎఫ్‌కు వరుసగా ఆర్డర్లు ఇచ్చేది. అయితే మోదీ సర్కారు దీన్ని కార్పొరేషన్ పరిధిలోకి తీసుకు వచ్చింది. ఆర్మ్‌డ్ వెహికిల్స్ నిగమ్ లిమిటెడ్ (ఏవీఎన్ఎల్)లోకి చేర్చారు. దీంతో ఆర్డర్లు తగ్గిపోయాయి. గతంలో ఓవర్ డ్యూటీలు చేసే కార్మికులు.. ఇప్పుడు పనిలేక ఉన్న కొలువులు ఎక్కడ ఊడిపోతాయోనన్న భయంతో బతికేయాల్సి వస్తున్నది. ఆర్డర్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరితే ఓపెన్ టెండర్లలో పాల్గొని తెచ్చుకోవాలంటూ సూచిస్తోంది. దీని వెనుక కంపెనీని ప్రైవేట్‌పరం చేయాలన్న కుట్ర ఉందన్న విమర్శలు వస్తున్నాయి. 3 వేల మంది కార్మికులు, వారి కుటుంబాల భవిష్యత్తు అంధకారంగా మారుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే జిల్లాలోని భానూరులో బీడీఎల్ పరిశ్రమ ఉన్నది. దీనికీ కేంద్ర ప్రభుత్వం మొండిచెయ్యే చూపిస్తున్నది. ప్రైవేటీకరించే దిశగా అడుగులు పడుతున్నాయి. దీన్ని వ్యతిరేకిస్తూ ఇటీవలే కార్మికులు ఆందోళన సైతం చేశారు.

భెల్‌కు ఆర్డర్లివ్వని కేంద్రం

సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురంలో బీహెచ్ఈఎల్ ఉన్నది. దీన్ని ప్రైవేట్‌పరం చేసే కుట్రను మోదీ ప్రభుత్వం పన్నుతోందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 5 వేల మంది కార్మికులు భెల్‌లో పనిచేస్తున్నారు. ఈ పరిశ్రమలో గ్యాస్ టర్బైన్లు, ఆయిల్ రిగ్గులు, కంప్రెషర్లు, బాయిలర్లు, హీటర్లు, భారీ పంపులు తయారవుతాయి. మోదీ గద్దెనెక్కిన తర్వాత ప్రభుత్వ ఆర్డర్లు కరువయ్యాయి. వేలాది కోట్ల రూపాయల లాభాలను ఆర్జించిన బీహెచ్ఈఎల్.. నష్టాల బాటపట్టింది.

కేసీఆర్ చొరవతో..

మూడేండ్ల క్రితం అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేయూతనివ్వడంతో ప్రస్తుతం భెల్ లాభాలను ఆర్జిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన పంపుల ఆర్డర్లను బీహెచ్ఈఎల్‌కే ఇచ్చారు. అలాగే తెలంగాణలో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్తు ప్రాజెక్టులకు సంబంధించి మిషనరీ ఆర్డర్ కూడా దక్కింది. బీహెచ్ఈఎల్ మనుగడకు నాటి సీఎం కేసీఆర్ నిర్ణయాలే కారణమని కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయిప్పుడు. మొత్తానికి ప్రధాని మోదీ ఆత్మనిర్భర్ భారత్ అంటూ ప్రైవేట్ కంపెనీలకు పెద్ద పీట వేస్తున్నారని కార్మిక నాయకులు మండిపడుతున్నారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ రంగ సంస్థలు మూతబడేలా చేస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు.

బెంజ్ ఎంట్రీలెవల్ ఈవీ కారు

ప్రారంభ ధర రూ.66 లక్షలు

న్యూఢిల్లీ, జూలై 8: లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్-బెంజ్..తొలిసారి లగ్జరీ కార్లను కొనుగోలు చేసేవారి లక్ష్యంగా ఎలక్ట్రిక్ ఎంట్రీలెవల్ కారును అందుబాటులోకి తీసుకొచ్చింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.66 లక్షలు. వీటితో పాటు ఐదు సీట్ల ఈక్యూబీ 350 ఎస్‌యూవీ మాడల్ ధర రూ.77.5 లక్షలు, ఈక్యూబీ 250+(ఏడుగురు) రూ.70.90 లక్షల ధర కలిగిన మాడళ్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది చివర్లో ఈక్యూఎస్ మేబ్యాక్ ఎస్‌యూవీ, జీ-క్లాస్ మాడళ్లను సైతం ఈ ఏడాది చివర్లో ఈవీ విభాగంలో విడుదల చేయనున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ తెలిపారు. వీటి ధర రూ.3 కోట్లు ఉండనున్నట్లు చెప్పారు.

హెచ్‌డీఎఫ్‌సీ రుణాలు ప్రియం

వడ్డీరేట్లను 10 బేసిస్ పాయింట్లు పెంచిన బ్యాంక్



హైదరాబాద్, జూలై 8: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరోసారి వడ్డీరేట్లను పెంచింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్‌ఆర్)ని 10 బేసిస్ పాయింట్లు పెంచడంతో రుణ గ్రహీతలపై అదనపు భారం పడనున్నది. దీంతో ఎంసీఎల్‌ఆర్ రేటు 9.05 శాతం నుంచి 9.40 శాతం మధ్యలోకి చేరింది. పెరిగిన రేట్లు సోమవారం నుంచి అమలులోకి వచ్చాయని పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఒక్కరోజు కాలపరిమితి రుణాలపై వడ్డీరేటుని 10 బేసిస్ పాయింట్లు పెంచడంతో వడ్డీరేటు 8.95 శాతం నుంచి 9.05 శాతానికి చేరుకున్నది. అలాగే నెల కాల పరిమితితో రుణాలపై వడ్డీ 9 శాతం నుంచి 9.10 శాతానికి పెరగగా..మూడు నెలల రుణాలపై వడ్డీరేటు 5 బేసిస్ పాయింట్లు సవరించడంతో రేటు 9.15 శాతం నుంచి 9.20 శాతానికి చేరుకున్నది. ఆరు నెలల రుణాలపై రేటు 9.30 శాతం నుంచి 9.35 శాతానికి చేరుకోగా, ఏడాది రుణాలపై రేటు 9.30 శాతం నుంచి 9.40 శాతానికి సవరించింది. రెండేండ్లు, మూడేండ్ల రుణాలపై రేటుని 9.40 శాతానికి సవరించింది బ్యాంక్. వీటితో పాటు బ్యాంక్ బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటుని 17.90 శాతానికి, బేస్‌రేటుని 9.40 శాతానికి పెంచింది.

ఆర్బీఐ సమీక్షకు టమాట సెగ

ముంబై, జూలై 8: మార్కెట్‌లో మళ్లీ పెరుగుతున్న టమాట ధరల సెగ.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కు తగులుతున్నది. తగ్గినట్టే తగ్గి తిరిగి పుంజుకున్న టమాట రేట్లు.. కిలో రూ.100కు చేరువయ్యాయి మరి. దీంతో ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతున్న సెంట్రల్ బ్యాంక్.. ఇంకొన్నాళ్లు అలాగే ఉంచవచ్చన్న అంచనాలు ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్నాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబైల్లో కిలో టమాట రూ.90 పలుకుతున్నది. కాగా, దేశీయంగా టమాట సాగులో కర్నాటక, ఏపీల వాటానే 35 శాతంగా ఉన్నది. తగ్గని ఉష్ణోగ్రతలు, కురువని వర్షాలు.. పంటకు ఆటంకంగా మారాయి. గత ఏడాది ఫిబ్రవరి నుంచి కీలక వడ్డీరేట్లు ఎక్కడివక్కడే ఉంటున్నాయి. ద్రవ్యోల్బణం దెబ్బకు వచ్చే నెల ద్రవ్యసమీక్షలోనూ అంతే ఉండొచ్చంటున్నారు.

పీఎస్బీల్లో వాటాల్ని అమ్మేయండి

ఇదే సరైన సమయం: ఎస్బీఐ నివేదిక • సర్కారీ బ్యాంకులు ఇంకా తగ్గాలి



న్యూఢిల్లీ, జూలై 8: ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్బీ)ల్లో వాటాల విక్రయానికి ఇదే సరైన సమయమని సర్కారీ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ సోమవారం తమ రిసెర్చ్ రిపోర్ట్‌లో పేర్కొన్నది. 'బ్యాంకులు ప్రస్తుతం పరిపుష్టంగా ఉన్నాయి. ప్రభుత్వ బ్యాంకుల్లో పెట్టుబడుల ఉపసంహరణకు కేంద్ర ప్రభుత్వానికి ఇదే సరైన సమయం. త్వరగా దీనిపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి' అని 'కేంద్ర బడ్జెట్ 2024-25కి నాంది' పేరిట విడుదల చేసిన ఈ నివేదికలో ఎస్బీఐ అభిప్రాయపడింది. ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణపై స్పందిస్తూ '2022 అక్టోబర్‌లో కొనుగోలుదారుల నుంచి బిడ్లను ఆహ్వానించారు. 2023 జనవరిలో ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల శాఖ (దీపం)కు కొందరు తమ ఆసక్తిని వ్యక్తపర్చారు. రాబోయే బడ్జెట్‌లో దీనిపై ఓ స్పష్టత రావచ్చు' అని ఎస్బీఐ తెలిపింది. ప్రస్తుతం ఐడీబీఐలో కేంద్రం వాటా 45.48 శాతంగా ఉంటే, ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్‌ఐసీ వాటా 49.24 శాతంగా ఉన్నది. మిగతా వాటా మైనారిటీ షేర్‌హోల్డర్ల వద్ద ఉన్నది. అయితే దాదాపు 61 శాతం వాటాను అమ్మేయాలని కేంద్రం, ఎల్‌ఐసీ చూస్తున్నాయి.

బ్యాంకుల సంఖ్య తగ్గాలి

ప్రస్తుతమున్న ప్రభుత్వ బ్యాంకులు మరింతగా ఏకీకృతం కావాలన్న అభిప్రాయాన్ని ఎస్బీఐ వెలిబుచ్చింది. తద్వారా ఇంకా సర్కారీ బ్యాంకుల సంఖ్య తగ్గాల్సిన అవసరం ఉందని చెప్పింది. ఇప్పటికే గతంతో పోల్చితే ప్రభుత్వ బ్యాంకుల సంఖ్య చాలా తగ్గిపోయింది. ఆయా బ్యాంకుల్లో ఒకటి, రెండు, అంతకుమించి బ్యాంకులు విలీనమైపోయాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం 12 సర్కారీ బ్యాంకులే మిగిలాయి. అయినప్పటికీ ఇంకా తగ్గాలని ఎస్బీఐ చెప్తుండటం ఇప్పుడు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. డిపాజిట్లపై పొందే వడ్డీ ఆదాయంపై పన్నును సవరించాలని ఎస్బీఐ కేంద్రానికి సిఫార్సు చేసింది. మ్యూచువల్ ఫండ్, ఈక్విటీ మార్కెట్లకు అనుగుణంగా సర్దుబాటు చేయాలని కోరింది. '2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రజల నికర ఆర్థిక పొదుపు జీడీపీలో 5.3 శాతానికి తగ్గింది. గత ఆర్థిక సంవత్సరం 2023-24లో ఇది 5.4 శాతానికే పెరుగవచ్చనిపిస్తున్నది. అయితే మ్యూచువల్ ఫండ్ల రాబడులతో సమానంగా డిపాజిట్ల వడ్డీరేటుంటే సేవింగ్స్ బాగా పెరిగేందుకు వీలున్నది.' అని ఎస్బీఐ ఆర్థిక మంత్రిత్వ శాఖకు ఈ సందర్భంగా సూచించింది. ఈ నెల 23న ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు.

స్టార్ ఫిన్‌సర్వ్‌కు ఆర్బీఐ షాక్

న్యూఢిల్లీ, జూలై 8: మరో రెండు బ్యాంకింగేతర ఆర్థిక సేవల సంస్థలకు రిజర్వుబ్యాంక్ షాకిచ్చింది. అక్రమ రుణ పద్ధతుల కారణంగా స్టార్ ఫిన్‌సర్వ్ ఇండియాతోపాటు మరో సంస్థ పాలీటెక్స్ ఇండియా లైసెన్స్‌లను రద్దు చేసింది. హైదరాబాద్‌కు చెందిన స్టార్ ఫిన్‌సర్వ్ ఇండియా ప్రోగ్క్యాప్, అలాగే ముంబై కేంద్రస్థానంగా పాలీటెక్స్ ఇండియా కార్యకలాపాలు అందిస్తున్నాయి. అవుట్‌సోర్సింగ్ ద్వారా డిజిటల్‌గా రుణాలు మంజూరు, వసూళ్లు నిర్వహించినందుకుగాను స్టార్ ఫిన్‌సర్వ్‌కి చెందిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది. కేవైసీ ధృవీకరణ ప్రక్రియ కూడా అవుట్‌సోర్సింగ్ ఇవ్వడం ఆర్బీఐ అభ్యంతరాలు వ్యక్తంచేసింది.

హైదరాబాద్‌లో సీ1 విస్తరణ

మరో 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన ఆఫీస్

హైదరాబాద్, జూలై 8: అమెరికాకు చెందిన ఐటీ సేవల సంస్థ సీ1..హైదరాబాద్‌లో గ్లోబల్ ఇన్నోవేషన్ అండ్ కేపబిలిటీ సెంటర్(జీఐసీసీ)ని మరింత విస్తరించింది. గతేడాది 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన కార్యాలయానికి అదనంగా మరో 20 వేల చదరపు అడుగుల కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించింది. సత్వ నాలెడ్జ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 600 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, ఈ సంఖ్యను మరింత పెంచుకునే అవకాశం ఉన్నదని కంపెనీ ఎండీ, కంట్రీ హెడ్ చంద్ర బొడ్డొజు తెలిపారు. అంతర్జాతీయంగా ఫార్చ్యూన్ 500 సంస్థల్లో సగం తమ క్లయింట్లను, వీటికి ఇక్కడి నుంచే సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే పరిశోధన-అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ)ని కూడా ఏర్పాటు చేసినట్లు, దీంట్లో ప్రస్తుతం 60 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది చివరినాటికి మొత్తం సిబ్బంది సంఖ్యను వెయ్యికి పెంచుకునే అవకాశాలున్నాయన్నారు.